క్లుప్తంగా

సుప్రసిద్ధ రచయిత్రి తేజోవతి కన్నుమూత



పాత గుంటూరు: సమాచార శాఖ విశ్రాంత డెప్యూటీ డైరెక్టర్, దివంగత ఏ. విఠల్‌రావు సతీమణి సుప్రసిద్ధ రచయిత్రి డాక్టర్ అధరాపురపు తేజోవతి (88) ఆదివారం ఉదయం గుంటూరులో కన్నుమూశారు. ఆమె అనేక నవలలు, కథలు రాశారు. పూర్వా సంధ్య ప్రవర్తతే, మృత్యోర్మ అమృతంగమయ, విద్యార్థి లాంటి 15 కు పైగా నవలలు, 250 కథలు, 100కు పైగా రేడియో కథానికలు రాశారు. నాగార్జున విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారం, బొమ్మిడాల జాతీయ సాహిత్య పురస్కారం ద్వారా అందిన రూ. 3 లక్షలను తను చదివిన శారదానికేతనం విద్యాలయం అభివృద్ధికి విరాళంగా అందజేశారు. వృద్ధుల ఆశ్రమాలు, పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం ఇప్పటికీ ప్రతి నెలా అందిస్తున్నారు. అంతిమయాత్ర సోమవారం ఉదయం 10 గంటలకు స్వగృహం నుంచి ప్రారంభం అవుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

విస్మృత సాహిత్య సృజన కేవీఆర్ సొంతం



లక్ష్మీపురం: విస్మృత సాహిత్య సృజనతో పాటు జీవితాంతం ప్రజా ఉద్యమాలలో కె.వి.రమణారెడ్డి పని చేశారని ప్రజా నాట్య మండలి జాతీయ కార్యదర్శి గని కొనియాడారు. అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కె.వి.ఆర్ సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. అభ్యుదయ ప్రగతిశీల భావాల వ్యాప్తికి, సాహిత్యకారునిగా మార్క్సిజం వెలుగులో కె.వి.ఆర్ పని చేశారని తెలిపారు. అధ్యాపకునిగా తోటి ఉపాధ్యాయులను, విద్యార్థులను కూడా రచయితలుగా తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి, సాహితీవేత్త ప్రసాదరావు, గాయకులు శ్యామాచార్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్‌ఐగా శ్రీనివాసరావు సేవలు అభినందనీయం



తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా బాధ్యతలు నిర్వహించిన అల్లంశెట్టి శ్రీనివాసరావు ఆదివారం పదవీ విరమణ చేశారు. దంపతులను సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సీహెచ్. రవికాంత్, సీఐ కల్యాణ్ రాజు మాట్లాడుతూ ఎస్‌ఐగా శ్రీనివాసరావు సేవలు అభినందనీయమన్నారు. కేసుల విషయంలో సూచనలు, సలహాలు బాగా ఇచ్చేవారని తెలిపారు. అలాంటి సీనియర్లు పదవీ విరమణ అనంతరం కూడా ప్రజలకు సేవలతో పాటు పోలీస్ శాఖకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు రమేష్‌బాబు, ప్రతాప్‌కుమార్, సాయిబాబా, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి పరిశుద్ధ సమాజ కూడికలు

తెనాలి అర్బన్: ఫిల డెల్ఫియా చర్చి ఆధ్వర్యంలో సోమవారం నుంచి బుధవారం వరకు పరిశుద్ధ సమాజ కూడికలు నిర్వహించనున్నట్లు పాస్టర్ సీహెచ్.నతానియేలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మారీసుపేట రెండు గేట్ల మధ్యలోని కొలకలూరు మత్తయ్య హాస్టల్ ఆవరణలో ప్రతిరోజు రాత్రి 7 గంటలకు సభలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. విజయవాడకు చెందిన బ్రదర్ సీహెచ్.డేవిడ్ బ్రెన్‌హాం, ధరణి కోటకు చెందిన బ్రదర్ రేనాల్ట్స్ బాబు వాక్య పరిచర్య చేస్తారని తెలిపారు.

175/175 సీట్లు ఖాయం

తాడికొండ: దేశ చరిత్రలో 'మీకు మేలు జరిగితేనే నాకు ఓటెయ్యండ'ని చెప్పిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని ఎమ్మెల్యే, మాజీ హోం మంత్రి, తాడికొండ నియోజకవర్గ అభ్యర్థి మేకతోటి సుచరిత అన్నారు. ఆదివారం తుళ్లూరు మండలం నేలపాడు, శాఖమూరు గ్రామాల్లో నిర్వహించిన నాయకుల ఆత్మీయ కలయిక, ప్రచారంలో భాగంగా ఆమె అందరినీ ఆప్యాయంగా పలకరించారు. ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కులం, మతం, ప్రాంతం, పార్టీ భేదం లేకుండా జగనన్న అందించిన సేవలకు ప్రజలు రుణం తీర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నారనేందుకు గడపగడపలో వస్తున్న ఆదరణే నిదర్శనమని తెలిపారు. 175/175 సీట్లలో వైఎస్సార్ సీపీని ప్రజలు గెలిపించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు పేదలకు ఒరగబెట్టిందేమిటో ఒక్కటంటే ఒక్కటైనా చెప్పుకోగలడా ? అని ప్రశ్నించారు. 45 సంవత్సరాల అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబు, సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి ఎదురొచ్చే దమ్ములేక, పలు పార్టీలను కూడగట్టుకొని రావడం ఆయన భయానికి నిదర్శనమని విమర్శించారు. ఎంతమంది నాయకులు కలిసి వచ్చినా రాష్ట్రంలో సీఎంగా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ఏసు పునరుత్థానం ప్రపంచానికి మహోదయం

- ప్రపంచ శాంతికి క్రీస్తు బోధనలే శరణ్యం
- శిలువపై ఆయన పలికిన ఏడు వాక్యాలు సదా చిరస్మరణీయం
- ప్రతి ఒక్కరూ క్షమ, దయా గుణాలను అలవర్చుకోవాలి
- విశ్వాసులందరికీ ఆయన రక్షకుడిగా నిలుస్తాడు
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రి రజని

పట్నంబజారు: సమాధి నుంచి మూడవ రోజు లేచిన ప్రభువు ఏసుక్రీస్తు పునరుత్థానం ప్రపంచానికి మహోదయం అని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని తెలిపారు. ఈస్టర్ పండుగను పురస్కరించుకుని ఆదివారం మంత్రి రజిని నగరంలోని తెలుగు బాప్టిస్టు చర్చి, సీఎస్ఐ చర్చి, కృపా మినిస్ట్రీస్, వెస్ట్ ప్యారిస్, జార్జిపేట, ఏటీ అగ్రహారం, తుఫాన్‌నగర్, గుజ్జనగుండ్ల లూథరన్స్ చర్చిల్లో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మానవులందరి పాప పరిహారార్థం శిలువను మోసి మరణాన్ని అనుభవించిన క్రీస్తు మూడవ దినమున సమాధి నుంచి తిరిగి లేచారని, నాటి నుంచి ఆయన విశ్వాసులందరికీ రక్షకుడిగా ఉన్నారని తెలిపారు. శిలువపై ఆయన పలికిన ఏడు వాక్యాలు ప్రపంచ ప్రజలందరికీ సదా చిరస్మరణీయాలని పేర్కొన్నారు. ఆయన పలికిన ఒక్కో మాటలో ప్రపంచానికి కావలసిన అద్భుతమైన సందేశం ఉంటుందన్నారు. ఏసుక్రీస్తు పునరుత్థానమే సకల సందేహాలకు పెద్ద సమాధానమని చెప్పారు. క్రీస్తు పునరుత్థానాన్ని నిండు హృదయంతో క్రీస్తు విశ్వాసులంతా వేడుకగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ప్రపంచంలో నెలకొన్న విద్వేష పరిస్థితుల్లో క్షమ, దయా గుణాలను ప్రబోధించేవి ఏసుక్రీస్తు బోధనలే ప్రపంచ ప్రజలందరికీ శరణ్యమని చెప్పారు. కార్యక్రమంలో డివిజన్ల కార్పొరేటర్లు, పార్టీ అధ్యక్షులు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

ముస్లింలకు మేలు చేసిన సీఎం జగన్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రజని, వేదికపై విప్ అప్పిరెడ్డి తదితరులు

ముస్లింలకు పెద్దపీట వేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని చెప్పారు. నగరంపాలెంలో పార్టీ నేత టింబర్ డిపో బుజ్జి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆమెతో పాటు శాసనమండలి విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్. రాజశేఖరరెడ్డి ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్‌లు కల్పించి, వారిని అన్ని విధాలుగా ఆదుకున్నారని తెలిపారు. మహానేత వైఎస్సార్ అడుగుజాడల్లో సీఎం వైఎస్. జగనన్న నడుస్తూ వారికి ప్రతి అంశంలో ప్రాధాన్యత కల్పిస్తున్నారని చెప్పారు. శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ ముస్లింలకు కనీసం మంత్రి వర్గంలో స్థానం ఇవ్వని పార్టీ టీడీపీ అయితే.. ఏకంగా ఉప ముఖ్యమంత్రి పదవిని ఇచ్చి తాను ముస్లిం పక్షపాతినని సీఎం వైఎస్. జగన్ చాటిచెప్పారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ముస్లింలంతా సీఎం జగన్‌కు అండగా ఉండాలని, కచ్చితంగా ఆయన్ని ముఖ్యమంత్రిని చేసుకునేందుకు పాటుపడాలని పిలుపునిచ్చారు. ముందుగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు జీవితమే గొప్ప సందేశం

శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి

పట్నంబజారు: దయ, త్యాగం, కరుణ ఎంతో గొప్పవనే సందేశాన్ని తన జీవితం ద్వారా విశ్వమానవాళికి అందించిన మహోన్నతుడు ఏసుక్రీస్తు అని శాసనమండలి విప్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. సత్యంపై విశ్వాసానికి ఉన్న శక్తిని తెలిపిన మహిమాన్వితమైన రోజు ఈస్టర్ అని పేర్కొన్నారు. ఏసీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ముత్యం నివాసంలో ఆదివారం జరిగిన ఈస్టర్ పర్వదిన వేడుకలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విప్ అప్పిరెడ్డి మాట్లాడుతూ సత్యాన్ని అంతం చేయాలని చూసిన ప్రతిసారీ అది ఏదో ఒక రూపంలో జన్మిస్తూనే ఉంటుందన్నారు. హింస, ద్వేషాలు కేవలం మరణాన్ని మాత్రమే మిగిల్చితే.. ప్రేమ, క్షమాగుణాలు జీవితత్వానికి నూతనత్వాన్ని ఇస్తాయని తెలిపారు. ఈ సత్యాన్ని నిరూపించడానికి సమాధి నుంచి సజీవుడై ఏసు ప్రభువు లేచి వచ్చారని తెలిపారు. ప్రపంచ మానవాళి శ్రేయస్సు కోసం, విశ్వ సంక్షేమం కోసం ప్రతి ఒక్కరికీ క్రీస్తు మార్గం అనుసరణీయమన్నారు. యావత్ క్రైస్తవ సమాజానికి ఈస్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వేడుకలకు హాజరైన వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణను లేళ్ల అప్పిరెడ్డి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు పాల్గొన్నారు.



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న విప్ అప్పిరెడ్డి, అంబటి మురళీకృష్ణ, పార్టీ నేతలు

పేదలంటే చంద్రబాబుకు చులకన

- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో పలు కుటుంబాలు చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వారిని స్వాగతిస్తున్న మంత్రి రజని

పేద వర్గాలంటే.. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడుకి తొలి నుండి చులకనేనని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని విమర్శించారు. శనివారం స్థానిక చంద్రమౌళీ నగర్ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో 44వ డివిజన్‌కు చెందిన వందకు పైగా ఎస్సీ కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. మంత్రి రజిని మాట్లాడుతూ ట్రక్కు డ్రైవర్‌కు, ఉపాధి కూలీలకు ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చారంటూ చంద్రబాబునాయుడు అవహేళనగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ధనవంతులకు మాత్రమే రాజకీయ అవకాశాలు దక్కేలా టీడీపీ చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ అందుకు భిన్నంగా పయనిస్తోందని, పార్టీ కోసం నిజాయతీగా పనిచేసిన కార్యకర్తలకు జెడ్పీ, కార్పొరేషన్ చైర్మన్లు, మేయర్ వంటి ఉన్నత పదవులే కాకుండా ఇప్పుడు ఎమ్మెల్యే టిక్కెట్లు కూడా ఇచ్చిందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో పేదలంతా ఒకవైపు, పెత్తందారులంతా ఒకవైపు ఉండబోతున్నారని, పేదలంతా ఏకతాటిపై నిలిచి వారి పక్షాన పోరాడే వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. నగర 44వ డివిజన్ టీడీపీ ప్రధాన కార్యదర్శి మద్దూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పార్టీలో 22 ఏళ్లుగా పని చేస్తున్నా గుర్తింపు లేకుండా పోయిందన్నారు. తనతో పాటు కొరిటిపాడు ప్రాంతానికి చెందిన ఎస్సీలంతా తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసి వైఎస్సార్ సీపీలో చేరినట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో తెలుగుదేశం పార్టీ బూత్ కమిటీ మెంబర్లు కొట్టే బాలస్వామి, మీసు చెన్నకేశవరావు, ఎస్సీ సెల్ నాయకుడు వై.యాకోబు, మహిళా నాయకురాలు వల్లపూరి మేరి, బత్తుల రవి, కొట్టే పవన్‌కుమార్, వజ్రాల రాజశేఖర్, కోకట్లపల్లి మాణిక్యరావు, అమృతలూరి శ్రీనివాసరావు ఉన్నారు. కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు రాతంశెట్టి సీతారామాంజనేయులు, పార్టీ నాయకులు విడదల గోపీనాథ్ పాల్గొన్నారు.

బీసీలంటే సమాజానికి బ్యాక్ బోన్



పోస్టర్‌లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రోశయ్య



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి విడదల రజిని

పట్నంబజారు: బీసీలంటే సమాజానికి బ్యాక్ బోన్ అని చాటిచెప్పిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి దక్కుతుందని పార్టీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్య చెప్పారు. గుంటూరులోని 30 డివిజన్ ఆర్.అగ్రహారంలో బీసీ నేత గూడూరి నాని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. జై బీసీ.. వన్స్‌మోర్ వైఎస్సార్ సీపీ అనే పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే రోశయ్య మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా బీసీలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అనంతరం ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే కిలారి రోశయ్య చుట్టుగుంట సమీపంలోని కృపా మినిస్ట్రీస్‌లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

బీసీలంటే సమాజానికి వెన్నుముకలు

నెహ్రూనగర్: బీసీలంటే సమాజంలో వెనుకబడిన కులాలు కాదని..సమాజానికి వెన్నుముక వర్గాలని చాటి చెప్పి వారి అభివృద్ధికి బాటలు వేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి , పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని పేర్కొన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు గూడూరు నాని ఆధ్వర్యంలో జై బీసీ.. వన్స్ మోర్ వైఎస్సార్ సీపీ పోస్టర్‌ను ఆదివారం ఏటీ అగ్రహారంలో మంత్రి రజిని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అంటే బీసీల పార్టీ అనే వాస్తవాన్ని రాష్ట్రంలో బీసీ సామాజిక వర్గాలన్నీ గుర్తించాయి అన్నారు. గ్రామ , వార్డు సభ్యుల నుంచి శాసన సభాపతి, రాజ్యసభ పదవుల వరకు అగ్రస్థానం కల్పించి బీసీల పక్షపాతిగా సీఎం వై.ఎస్. జగన్ చరిత్రలో నిలిచారని కొనియాడారు. బీసీలకు ప్రత్యేకంగా 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేయడంతో పాటు శాశ్వత కమిషన్ ఏర్పాటు చేసినట్లు ఆమె గుర్తు చేశారు. చంద్రబాబు పాలనలో బీసీలకు జరిగిన అవమానాలు, వేధింపులు అన్నీఇన్నీ కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ ప్రభుత్వంలో ప్రతి బీసీకీ న్యాయం జరిగిందని ధైర్యంగా చెబుతామని, అలా చెప్పే ధైర్యం టీడీపీకి ఉందా ? అని ప్రశ్నించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు నాని మాట్లాడుతూ రాష్ట్రంలో పెత్తందారుల కూటమి కూలిపోవడం ఖాయమని తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీసీలంతా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వెంట నడిచేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, పార్టీ నేతలు, బీసీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటు వేయడం అందరి బాధ్యత

ముస్లిం మత పెద్దల పిలుపు



లక్ష్మీపురం: ప్రతి ఒక్కరూ అమూల్యమైన ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని ముస్లిం మతపెద్ద మౌలానా ఇస్మాయిల్ పిలుపునిచ్చారు. పొన్నూరు రోడ్డులోని ముస్లిం కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటు వేసే ముందు ఒక్క క్షణం ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. రాబోయే తరం భవిష్యత్తు కోసం ఓటును సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు ముస్లిం మైనారిటీలు ఓటు వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకోవాలని చెప్పారు. ఓటరు కార్డు లేని వారు ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఆన్‌లైన్ ద్వారా సచివాలయాల్లో , నెట్ సెంటర్‌లలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మన ఓటు రాష్ట్రంతో పాటు మన పిల్లల భవిష్యత్తును నిర్ణయిస్తుందన్నారు. మన ఓటు సంక్షేమం, అభివృద్ధికి పునాది అవుతుందన్నారు. ముస్లింలంతా ఓటు వేసేలా మసీదుల్లో ఇమాం, మౌజన్‌లు, మత పెద్దలు అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం ఓటు కార్డు గురించి అవగాహన కల్పించే కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు మౌలానా మున్వర్, అబ్దుల్ ఖని, హఫీజ్ ఇసాక్, మౌలానా మహబూబ్, గులాం అలీ, ఖారి ఉస్మాన్, హఫీజ్ షంషుద్దీన్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిపుష్టికి ఓటు దివ్యౌషధం



ఓటుహక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేస్తున్న లెట్స్ వోట్ సంస్థ ప్రతినిధులు


గుంటూరు ఎడ్యుకేషన్: ప్రజాస్వామ్య పరిపుష్టికి ఓటు దివ్యౌషధమని లెట్స్ వోట్ స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర సమన్వయకర్త ప్రొఫెసర్ కె. మాలకొండయ్య పేర్కొన్నారు. ఆదివారం బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియం ఎదుట లెట్స్ వోట్ ఆధ్వర్యంలో సంస్థ సభ్యులు ఓటుహక్కు వినియోగ ప్రాధాన్యతను చాటారు. టీ షర్ట్స్ ధరించి ప్లకార్డులతో వాకర్లు, పాదచారులను కలిసి ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాలకొండయ్య మాట్లాడుతూ ప్రజాస్వామ్య మనుగడకు ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవడమే దివ్య ఔషధమని తెలిపారు. పట్టణ ప్రాంత ప్రజలు, ప్రధానంగా విద్యావంతులు, వివిధ వృత్తుల్లో ఉన్న వారు వినియోగించుకోవడంలో ప్రదర్శిస్తున్న నిర్లిప్తత విచారకరమని పేర్కొన్నారు. విద్యావంతులు, రాజకీయ, సామాజిక చైతన్యం కలిగిన గుంటూరు నగరంలో గత ఎన్నికల్లో ఓటింగ్ శాతం చాలా తక్కువగా ఉండటం బాధాకరమని తెలిపారు. బృందావన్‌గార్డెన్స్, చంద్రమౌళీ నగర్, ఎస్వీఎన్ కాలనీ, వికాస్‌నగర్, విద్యానగర్, రాజేంద్రనగర్ తదితర ప్రాంతాల్లో అతి తక్కువ మంది ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని పేర్కొన్నారు. ఓటుకు దూరంగా ఉండటం వల్ల రాజకీయ పార్టీల నుంచి సంక్షేమం, మౌలిక సౌకర్యాల గురించి ప్రశ్నించే హక్కును కోల్పోతారని అన్నారు. లెట్స్ వోట్ సంస్థ ఏ రాజకీయ పార్టీకి అనుకూలం, వ్యతిరేకం కాదని ఓటు హక్కుపై ప్రజలను జాగృతి చేయటమే తమ లక్ష్యమని వివరించారు. సామాజిక కార్యకర్త డాక్టర్ కె.శ్రీవిద్య మాట్లాడుతూ అపార్ట్‌మెంట్స్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోని మహిళలు అనేక కారణాలు చెబుతూ ఓటుహక్కును వినియోగించుకోకపోవడం బాధాకరమని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో తప్పనిసరిగా మహిళలు ముందుకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ సభ్యులు లెట్స్ వోట్ సంస్థ చేస్తున్న సామాజిక చైతన్యానికి హర్షం వ్యక్తం చేస్తూ, రూ.ఐదు వేల ఇచ్చి ఉదారతను చాటారు. కార్యక్రమంలో లెట్స్ వోట్ సంస్థ గుంటూరు చాప్టర్ కన్వీనర్ బాలాజీ శ్రీనివాస్, కందిమళ్ల వెంకట్రావు, మహమ్మద్ రఫీ, నగేష్ కన్నా, వీర రాఘవయ్య, వీవీకే సురేష్, మొవ్వా చంద్రమౌళీ, రాజేశ్వరరావు, కేవీ భాస్కర్, సతీష్, బుల్లి కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన

- ఎన్టీఆర్ విగ్రహానికి అధికారులు ముసుగేస్తే... టీడీపీ నేతలు తొలగించారు
- తాడికొండ మండలం మోతడకలో ఘటన
- ఆర్ అండ్ బీ, పంచాయతీ స్థలంలో అనుమతులు లేకుండా పార్టీ కార్యాలయం నిర్మాణం
- 2006లో విగ్రహ నిర్మాణనికి పంచాయతీ తీర్మానం, 2021లో పార్టీ కార్యాలయంగా మార్పు



ఎన్నికల కోడ్ వచ్చిన వెంటనే విగ్రహం, పార్టీ కార్యాలయానికి ముసుగేసిన అధికారులు



ఇటీవల ముసుగు తొలగించిన ఎన్టీఆర్ విగ్రహం

తాడికొండ: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే అధికారులు ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగేస్తే, టీడీపీ నాయకులు తొలగించిన వైనం తాడికొండ మండలం మోతడక గ్రామంలో జరిగింది. గ్రామంలో ఆర్ అండ్ బీ, పంచాయతీ స్థలంలో ఎన్టీఆర్ విగ్రహ నిర్మాణానికి 2006లో తీర్మానం చేసి నిర్మించారు. అనంతరం విడతల వారీగా దానిపై శ్లాబ్ వేసి, 2021లో ఏకంగా పార్టీ కార్యాలయంగా చేసేశారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ స్థలంలో పార్టీ కార్యాలయాలకు అనుమతులు ఉండకూడదు, ఒక వేళ నిర్మించాలనుకున్నా పక్కాగా సీఆర్డీయే అనుమతులు ఉండాలి. కానీ ఇక్కడ అలాంటివి ఏమీ జరగలేదు. పార్టీ కార్యాలయం నిర్మాణం జరిగిన నాటి నుంచి ఇప్పటి వరకు పక్కా భవనానికి కనీసం పంచాయతీకి కూడా పన్ను చెల్లించడం లేదంటే నిబంధనల ఉల్లంఘన ఏ మేరకు జరుగుతుందో చెప్పాల్సిన అవసరం లేదు. ఎన్నికల కోడ్‌లో భాగంగా ఇప్పటికే పార్టీ కార్యాలయాలుగా కొనసాగుతున్న భవనాల్లో ఎలాంటి తొలగింపులు ఉండవంటూ అధికారులు చెబుతున్నారు. అయితే, ఇక్కడ విగ్రహ నిర్మాణానికి, భవనం నిర్మాణానికి మధ్య వేర్వేరు సమయాల్లో పంచాయతీ తీర్మానాలు చేశారు. విగ్రహానికి 2006లో, భవన నిర్మాణానికి 2021లో అనుమతులు కోసం పంచాయతీ తీర్మానం జరిగింది. అంటే సుమారు 18 సంవత్సరాల సమయంలో వేర్వేరుగా నిర్మాణం జరిగింది. కానీ పార్టీ కార్యాలయంలో విగ్రహంగా పరిగణనలోకి తీసుకొని యథేచ్ఛగా ముసుగు తొలగించడంపై పలువురు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి నిర్మించిన భవనాన్ని తొలగించడంతో పాటు ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగులు వేసేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం

సంబంధిత కార్యాలయాన్ని ఇప్పటికే పరిశీలించాం. నివేదికను జిల్లా కలెక్టర్ గారి దృష్టికి తీసుకెళ్లాం. వారి నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటాం.

– ఎం. గంగరాజు, తాడికొండ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి

ఘనంగా మంజునాథ నాట్య క్షేత్రం వార్షికోత్సవం



నాట్యక్షేత్రం చిన్నారులతో అతిథులు

పాత గుంటూరు: లక్ష్మీపురంలోని శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం వేదికపై ఆదివారం శ్రీ మంజునాథ నాట్యక్షేత్రం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. వ్యవస్థాపకులు రాజుపాలెం మనోజ్ఞ ఆధ్వర్యంలో జరిగిన సభలో ముఖ్య అతిథులుగా విజయ మాధవి సేవా సంస్కృత అకాడమీ అధ్యక్షురాలు విజయ మాధవి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలపై ఆసక్తి కలిగి ఉండాలని తెలిపారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే నృత్యంలో ప్రావీణ్యం పొందే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. ఈ సందర్భంగా నాట్య క్షేత్రం విద్యార్థుల ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శరణం నరేంద్రకుమార్, జంపని కిశోర్‌బాబు, సగుటూరు వెంకటరమణ, శారద, కె. శ్రీనివాసమూర్తి, సి.ఎ.కె.వి. బ్రహ్మం, మహంకాళి శ్రీనివాసరావు, డాక్టర్ టి. పవన్‌కుమార్, డాక్టర్ ఎం. వెంకట నరేష్, డాక్టర్ డి. నాగమల్లేశ్వరి, డాక్టర్ శర్మ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు



ట్రినిటీ ప్యారిస్ చర్చిలో సందేశమిస్తున్న పాస్టర్లు

పాత గుంటూరు: ఈస్టర్ పర్వదినాన్ని క్రైస్తవులు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చిల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనలలో విశేష సంఖ్యలో పాల్గొన్నారు. పాస్టర్లు ప్రార్థనలు నిర్వహించి ఈస్టర్ సందేశాన్ని వివరించారు. కొత్తపేటలోని ట్రినిటీ లూథరన్ చర్చిలో ఆరాధనలు నిర్వహించారు. రెవరెండ్ జె. ఆశీర్వాదం, రెవరెండ్ వి. క్రిష్టఫర్ ప్రత్యేక ప్రార్థనలు చేసి పండుగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో చర్చి చైర్మన్ గ్రేస్ సుదర్శనం భీమరాజు, కోశాధికారి బత్తుల లెనిన్, బి. విల్సన్ పాల్గొన్నారు.